

Dr.G.Rajesh

CMD INB MEDIA GROUP

TRUTH | TRUST | IMPACT

# INB TIMES

VOICE OF THE PEOPLE

INB TELUGU NEWS

ప్రచురణ: , తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సంపుటి : 03 సంచిక : 145 ఎడిటర్ : జి.రాజేష్ గురువారం 20 ఆగష్టు 2026 పేజీలు : 6 వెల రూ. 4.00


## బాంబు పేల్చిన సుష్మితా పటేల్



- సిఎం రేవంతా..పొంగులేటా...అర్థం కావడం లేదు
- కాంగ్రెస్ టిక్కెట్ ఇవ్వకుంటే ఒంటరిపోరాటం
- తెలంగాణ రాజకీయాల్లో కాక రేపిన కొండాసురేఖ తనయ
- వ్యాఖ్యలపై మండిపడ్డ ఎంపి మల్లు రవి

2లో

## సాగు, తాగునీటి సరఫరాపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- రెండేళ్లలో రూ.25 కోట్లతో 548 పనులు చేపట్టాం
- రెండేళ్ళలో 1800కోట్లతో పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తి
- చంద్రబాబు
- ముందుచూపు వల్లే ఏలేరు ఆయకట్టుకు నీరిస్తున్నాం
- అసెంబ్లీలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు




అమరావతి, **ఐఎన్‌బిటైమ్స్**

ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టుకు సాగు, తాగు నీటి సరఫరా పై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సూచనల మేరకు ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు. బుధవారం అసెంబ్లీలో యల్లసిరి కెనాల్ పనులు, ఏలేరు జలాశయం పరిధిలోని ఆయకట్టుకు నీటి సరఫరాపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి నిమ్మల సమాధానం ఇచ్చారు. ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టు

మిగతా 2లో

## త్యాగం మీది? అండ మాది



- వెలిగొండ నిర్వాసితులకు మరో రూ.200 కోట్ల పరిహారం
- నిర్వాసిత కుటుంబాలకు చెక్కు అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఇప్పటి వరకూ రూ.518 కోట్లు పరిహారం చెల్లింపు

అమరావతి, **ఐఎన్‌బిటైమ్స్**

వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభోత్సవానికి గడువు దగ్గర పడుతున్న వేళ నిర్వాసిత గ్రామాల ప్రజలకు పరిహారం అందిస్తూ ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు, ఇళ్లు కోల్పోయి త్యాగాలు చేసిన నిర్వాసిత కుటుంబాలకు అండగా నిలుస్తోంది. జూన్ 27న రూ.300కోట్లు అందించిన ప్రభుత్వం బుధవారం ముంపు బాధితులకు మరో రూ.200 కోట్ల పరిహారాన్ని ప్రభుత్వం అందించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు శాసన సభ ఆవరణలో నిర్వాసిత కుటుంబాలకు రూ.200 కోట్ల చెక్కును అందజేశారు. ఇప్పటి వరకూ వెలిగొండ నిర్వాసిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.518 కోట్లను పరిహారంగా అందించింది. ఈ సందర్భంగా

## ఈ నెలాఖరులో నల్లమల సాగర్ కి కృష్ణా జలాలు

- ప్రారంభోత్సవం చేయనున్న చంద్రబాబు
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి




## రిజర్వేషన్లతో బీసీలకు అందలం



రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

## గ్రూప్-1 పరీక్షలో అక్రమాలు కోకొల్లలు

- బరితెగించి గ్రూప్ 1 నియామకాల్లో అవకతవకలు
- ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, ప్లంబర్లతో జవాబు పత్రాల మూల్యాంకనం
- ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి అభ్యర్థుల జవాబు పత్రాలు
- 84 రోజుల పాటు హాయ్‌లాండ్‌లో పేపర్లు..నిబంధనలకు తిలోదకాలు
- భవిష్యత్తులో ఇలాంటి అవకతవకలకు తావులేకుండా ఏపీపీఎస్సీ ప్రక్షాళన
- ముఖ్యమంత్రి చంద్రబాబు అనర్హులతో పేపర్లు దిద్దించిన
- ఘనత ఆనాటి వైసిపిది
- ప్రైవేట్ ఏజెన్సీలకు పేపర్లు దిద్దే బాధ్యత అప్పగింత
- ప్రొఫెసర్లు చేయాల్సిన పనిని కార్మికులకు అప్పగింత
- అసెంబ్లీలో ఆనాటి దుర్మారగాన్ని ఏకరువు పెట్టిన చంద్రబాబు



అమరావతి, **ఐఎన్‌బిటైమ్స్**

గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్--1 పరీక్షల్లో ఊహకు కూడా అందని స్థాయిలో అక్రమాలు జరిగాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరోపించారు. గత పాలకులు బరితెగించి అక్రమాలకు పాల్పడ్డారని, రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించాల్సిన గ్రూప్ 1 సర్వీసు అభ్యర్థుల నియామకాల్లో అవకతవకలకు పాల్పడ్డారని అన్నారు. ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, సెక్యూరిటీ గార్డులతో జవాబు పత్రాల మూల్యాంకనం చేయించారని శాసనసభకు తెలియచేశారు. 344 నిబంధన కింద శాసనసభలో చేపట్టిన ప్రత్యేక చర్చలో ఆయన ఈ అంశాలను ప్రస్తావించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 315 ప్రకారం ఏర్పడిన ఏపీపీఎస్సీ రాష్ట్రానికి కీలకమైన అధికారులను ఎంపిక చేసే సంస్థ అని, దాని విశ్వసనీయతను

మిగతా 2లో

## 37 డిగ్రీ కాలేజీలకు కొత్త భవనాలు

- 175నియోజకవర్గాల్లో మోడల్ లైబ్రరీలు
- మంత్రి లోకేశ్



అమరావతి, **ఐఎన్‌బిటైమ్స్**

రాష్ట్రంలో విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని, ఇందులో భాగంగా సొంత భవనాలు లేని 37 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు శాశ్వత భవనాలు నిర్మిస్తామని విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో మోడల్ లైబ్రరీలను

- మిగతా 2లో

## బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసు




నటి నిధి అగర్వాల్‌కు ఇడి ప్రశ్నలు

# త్యాగం మీది? అండ మాది

ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ ప్రాజెక్టుల నిర్మాణం కోసం రైతులు, నిర్వాసితులు చేసిన త్యాగాలను ప్రభుత్వం గుర్తిస్తోందని వ్యాఖ్యానించారు. మిగతా పరిహారం సొమ్మునూ త్వరలోనే విడుదల చేస్తామని తెలిపారు. వెలిగొండ నిర్వాసితులను ఆదుకున్నది తమ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. మంచి చేసే ప్రభుత్వాలను గుర్తించాలని అన్నారు. భూములు, ఇళ్లను కోల్పోయిన తమకు ప్రభుత్వం అండగా నిలిచి పరిహారం అందించడం పట్ల నిర్వాసితులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజా ప్రతినిధులు, నేతలుపాల్గొన్నారు.

**రూ.518 కోట్ల మేర పరిహారం అందజేత:**

వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా సర్వం కోల్పోతున్న బాధితులకు అన్ని విధాలా అండగా నిలిచేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. సొంతంగా ఇళ్లు నిర్మించుకున్నందుకు గానూ ఓటీఎస్ కింద 2,557 కుటుంబాలకు ప్రభుత్వం రూ.318 కోట్ల మేర పరిహారం ఇప్పటికే చెల్లించింది. మరో 1,600 కుటుంబాలకు ఓటీఎస్ కింద రూ.200 కోట్లు పరిహారానికి సంబంధించి చెక్కును బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వాసితులకు అందించారు. దీంతో నిర్వాసితులకు ఇప్పటి వరకు పరిహారం కింద 4,157 కుటుంబాలకు రూ.518 కోట్లను ప్రభుత్వం చెల్లించినట్టైంది. నిర్వాసితుల కోసం 7 పునరావాస కాలనీల్లో ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది

. వేములకోట మినహా మిగిలిన 6 కాలనీల్లో మౌలిక సదుపాయాల పనులు ఇప్పటికే పూర్తి అయ్యాయి. దీంతో ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో నిర్మించిన ఇళ్లకు తరలి వెళ్తున్నాయి.

## బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసు

హైదరాబాద్,ఆగస్ట్19 బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్‌కు సంబంధించిన కేసులో సినీ నటి నిధి అగర్వాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. సుమారు రెండు

గంటల పాటు జరిగిన విచారణలో ఆమె ప్రమోట్ చేసిన బెట్టింగ్ యాప్స్‌కు సంబంధించిన పలు కీలక అంశాలపై అధికారులు ఆరా తీసినట్లు సమాచారం. ప్రమోషనల్ కార్యక్రమాలకు సంబంధించి కుదుర్చుకున్న కాంట్రాక్టులు, వాటి కాలపరిమితి, ప్రచారం కోసం అందించిన కంటెంట్, సోషల్ మీడియా లేదా ఇతర వేదికల ద్వారా నిర్వహించిన ప్రమోషన్స్‌పై కూడా ఈడీ అధికారులు వివరాలు సేకరించినట్లు సమాచారం. ఇక బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసినందుకు నిధి అగర్వాల్‌కు అందిన రెమ్యునరేషన్‌పై కూడా ఈడీ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సమాచారం.

ఒక్కో ప్రమోషన్‌కు ఎంత మొత్తంలో పారితోషికం తీసుకున్నారు, ఆ మొత్తాలు ఏ విధంగా చెల్లించబడ్డాయి, ఎవరి నుంచి చెల్లింపులు వచ్చాయి వంటి అంశాలపై అధికారులు వివరాలు నమోదు చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులు లేదా వారికి సంబంధించిన వ్యక్తులు నిధి అగర్వాల్ బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేసిన డబ్బు లావాదేవీలపై అధికారులు ఆరా తీసినట్లు సమాచారం. ఆ చెల్లింపులు ప్రమోషనల్ కాంట్రాక్టులకు సంబంధించినవేనా, వాటికి సంబంధించిన పత్రాలు ఉన్నాయా అనే అంశాలపై కూడా విచారణ జరిగినట్లు తెలుస్తోంది.

## సవాళ్లకు అనుగుణంగా పోలీస్ శాఖలో మార్పులు

### 513 మంది సిబ్బంది వివిధ విభాగాలకు బదిలీ

హైదరాబాద్,ఆగస్ట్19 మారుతున్న సవాళ్లకు అనుగుణంగా తెలంగాణ పోలీస్ శాఖలో పునర్వ్యవస్థీకరణ చేపడుతున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఇందులో భాగంగా గ్రేహౌండ్స్, ఆక్టోపస్, ఎస్ఐబీ విభాగాలకు చెందిన 513 మంది సిబ్బందిని ఇతర విభాగాలకు బదిలీ చేసినట్లు వెల్లడించారు. బదిలీ అయిన 513 మందిలో 5 మంది సీఐలు, 22 మంది ఎస్ఐలు, 14 మంది ఏఎస్ఐలు ఉన్నారు. వీరితో పాటు 84 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 388 మంది కానిస్టేబుళ్లకు కొత్త బాధ్యతలు అప్పగించినట్లు డీజీపీ తెలిపారు. ఈ బదిలీల్లో భాగంగా అత్యధికంగా 224 మందిని ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్డు భద్రత విభాగానికి కేటాయించారు. కొత్త బాధ్యతలు చేపట్టే ముందు సిబ్బందిని రెండు నెలల పాటు వివిధ విభాగాల్లో అటాచ్‌మెంట్ ద్వారా పనిచేయించనున్నట్లు డీజీపీ పేర్కొన్నారు. సిబ్బంది విద్యార్హతలు, అనుభవం, సామర్థ్యం ఆధారంగా తుది బాధ్యతలను నిర్ణయించనున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు.

## గల్లంతయిన మత్స్యకారుల కోసం ముమ్మర గాలింపు

అమరావతి,ఆగస్ట్19 సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు ఎప్పటికప్పుడు గాలింపు చర్యలకు సంబంధించిన వివరాలు తెలియచేస్తూ ఉండాలని ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. సముద్రంలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన కోనసీమ జిల్లాలోని మత్స్యకారుల గాలింపు చర్యలపై సీఎం చంద్రబాబు బుధవారం ఆరా తీశారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుతోపాటు ఉన్నతాధికారులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడు వర్చువల్‌గా సమావేశమయ్యారు. సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల ఆచూకీని కనుగొనేందుకు గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేయాలని ఈ సందర్భంగా వారిని ఆదేశించారు. గాలింపు చర్యలు ఏ మేరకు జరుగుతున్నాయని వారిని సీఎం అడిగి తెలుసుకున్నారు. మత్స్యకారుల ఆచూకీ కోసం కోస్ట్ గార్డ్స్, మెరైన్ పోలీసులు గాలిస్తున్నారని సీఎంకు వారు వివరించారు. జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు గాలింపు చర్యలను పర్యవేక్షిస్తోందని తెలిపారు. ఇప్పటికే రెండు డార్నియర్ విమానాలు, నేవీ బోట్లతో పాటు మరో ఏడు బోట్లతో గాలింపు చర్యలు చేపట్టామని ఉన్నతాధికారులు వివరించారు. పారాదీప్‌కు 14 నాటికల్ మైళ్ల దూరంలో కొన్ని పడవలను గుర్తించామని.. వాటి గురించి ఆరా తీస్తున్నామని చెప్పారు. కాకినాడ, భైరవపాలెం, విశాఖపట్నం, పారాదీప్ ప్రాంతాలకు చెందిన మత్స్యకారులను కూడా అప్రమత్తం చేసి గల్లంతైన బోటు ఆచూకీపై సమాచారం సేకరిస్తున్నట్లు సీఎం చంద్రబాబు దృష్టికి ఉన్నతాధికారులు తీసుకెళ్లారు.

# ఏలేరు ఆయకట్టుకు సాగు, తాగునీటి సరఫరాపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

(మొదటి పేజి (తరువాయి)

సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి క్షేత్రస్థాయిలో ఇటీవలే పరిశీలనలు చేపట్టామని మంత్రి తెలిపారు పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేలోపు ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టుకు నీరందించాలనే ముందుచూపుతో నాడు చంద్రబాబు పురుషోత్తపట్నం లిఫ్ట్ స్కీంను నిర్మించారని పేర్కొన్నారు. సూపర్ ఎల్‌నినో వంటి క్లిష్ట వాతావరణ పరిస్థితుల్లోనూ 53 వేల ఎకరాల ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టు, 1.48 లక్షల ఎకరాల పుష్కర ఆయకట్టుకు సాగు, తాగునీరు అందిస్తున్నామని తెలిపారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే పోలవరం ఎడమ కాలువ పనులపై రూ.1,800 కోట్లు ఖర్చు చేసి, అత్యంత క్లిష్టమైన పాంపా, తాండవ, ఏలేరు నదుల క్రాసింగ్ పనులతో పాటు 11 హైవే క్రాసింగ్ వంతెనల పనులను పూర్తి చేశామని తెలిపారు. పురుషోత్తపట్నం లిఫ్ట్ స్కీంతో పాటు పోలవరం ఎడమ కాలువ పనులను ముందుకు తీసుకెళ్లడం వల్లే ఏలేరు ఆయకట్టుకు సాగు, తాగు నీరు అందించే పరిస్థితి ఏర్పడిందని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టు సాగునీటి అవసరాల కోసం 950 క్యూసెక్కుల నీటిని పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఏలేరు ఆయకట్టుకు ఇప్పటివరకు 2.6 టీఎంసీల నీటిని పంపిణీ చేశామని మంత్రి వెల్లడించారు. గత ఐదేళ్ల పాలనలో ఏలేరు నదీగర్భంలో జరిగిన అక్రమ ఇసుక తవ్వకాల కారణంగా బెడ్ లెవల్ పడిపోయిందని, దీంతో గ్రావిటీ ద్వారా నీటిని అందించలేని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో 548 ౧ాడఓ పనులకు రూ.25 కోట్లు మంజూరు చేసి పనులు చేపట్టిందని తెలిపారు. ఎల్‌నినో వంటి క్లిష్ట పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఏలేరు ఆయకట్టుకు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మరో రూ.15.84 కోట్లతో ఓ అండ్ ఎం పనులకు ప్రతిపాదనలు పంపామని మంత్రి వెల్లడించారు.

# రిజర్వేషన్లతో బీసీలకు అందలం

అమరావతి, స్థానిక సంస్థల్లో వెనుకబడిన వర్గాలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించినందుకు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత నేతృత్వంలో బీసీ నాయకుల సంబరాలు జరుపుకున్నారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి బీసీ నేతలు హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ బీసీల అభ్యున్నతే లక్ష్యంగా టీడీపీ ఆవిర్భవించిందన్నారు. బీసీలకు వెన్ను దన్నుగా అన్న ఎన్టీఆర్, సీఎం చంద్రబాబునాయుడు నిలిచారన్నారు. బీసీలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక గుర్తింపు టీడీపీ ప్రభుత్వాల హయాంలోనే లభించాయన్నారు. తొలుత అన్న ఎన్టీఆర్ బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించి, వారిని రాజ్యాధికారంలో భాగస్వామ్యులు చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు బీసీలను అన్నిరంగాల్లో ముందంజలో ఉండేలా చర్యలు తీసుకున్నారన్నారు. అన్న ఎన్టీఆర్ బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే 1995లో సీఎం చంద్రబాబునాయుడు ఆ సంఖ్యను 34 శాతానికి పెంచారన్నారు. 2021 వరకూ ఆ రిజర్వేషన్లు కొనసాగుతూ వచ్చాయన్నారు. జగన్ వచ్చిన తరవాత స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లకు కోత విధించి, 24 శాతం అమలు చేశారన్నారు. దీనివల్ల బీసీలు 16,800 పదవులకు దూరమయ్యారన్నారు

## ఈ నెలాఖరులో నల్లమల సాగర్ కి కృష్ణా జలాలు

అమరావతి, భీమోదయం:
వెలుగొండ ప్రాజెక్టు శంకుస్థాపన చేసింది సీఎం చంద్రబాబు నాయుడేనని, ప్రారంభోత్సవం చేస్తోంది చంద్రబాబు నాయుడేనని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. బుధవారం అసెంబ్లీ ప్రాంగణంలో వెలిగొండ నిర్వాసితులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ 200 కోట్ల పరిహారం చెక్కును అందజేశారు. అనంతరం మీడియా సమావేశంలో మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజల 30 ఏళ్ల కలను సీఎం చంద్రబాబు నిజం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రాజెక్ట్ పనులతోపాటు నిర్వాసితుల సమస్యలను కూడా పరిష్కరిస్తున్నదని చెప్పారు. అందులో భాగంగా తొలి విడత రూ.318 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. నేడు రెండో విడతగా మరో రూ. 200 కోట్లు అందజేశామన్నారు. మిగిలిన రూ. 400 కోట్లు నిర్వాసితులకు త్వరలోనే చెల్లించి ఈ నెలలోనే నల్లమల్ల సాగర్ కు నీరిస్తామన్నారు. వెలుగొండ నిర్వాసితులను వైసిపి పార్టీ దారుణంగా మోసగించిందని,పూర్తికాని ప్రాజెక్టును జాతికి అంకితం చేసిన ఘనత ఆ పార్టీ నాయకుడికే చెల్లిందన్నారు. చెప్పినట్లే మార్కాపురం జిల్లా చేశామని, వెలుగొండకు శంకుస్థాపన చేసిన చంద్రబాబే తిరిగి ప్రారంభిస్తున్నారని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

# గ్రూప్-1 పరీక్షలో అక్రమాలు కోకొల్లలు

(మొదటి పేజి (తరువాయి)

దెబ్బతీసేలా గత ప్రభుత్వం వ్యవహరించిందని విమర్శించారు. గత ప్రభుత్వంలో సీఎం సీట్లో కూర్చుని నేరాలు చేసిన వ్యక్తి నేడు వాటిపై ప్రజలకు సమాధానం చెప్పేందుకు శాసనసభకు రాలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆక్షేపించారు. ఎదురు దాడి చేసేందుకు 24 గంటలూ కుట్రలు చేయటం కాదని బాధ్యతాయుతంగా జవాబు చెప్పాలని సవాలు చేశారు.

**కోర్టు ఆదేశాలను కూడా పట్టించుకోలేదు:**

2018లో జారీ చేసిన గ్రూప్--1 నోటిఫికేషన్‌కు 1.14 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 325 మందిని షార్ట్‌లిస్ట్ చేశారని. ఎంతో శ్రమించి అభ్యర్థులు ఉద్యోగాలు సాధించుకునే ఈ పరీక్షల నిర్వహణలో నిబంధనలను పూర్తిగా విస్మరించారని సీఎం అన్నారు. పదో తరగతి పరీక్షల జవాబు పత్రాలను సైతం అత్యంత భద్రత మధ్య పోలీసు ఎస్కార్టుతో తరలిస్తామని, అలాంటిది రాష్ట్రాన్ని పాలించే అధికారులను ఎంపిక చేసే గ్రూప్--1 పరీక్షల జవాబు పత్రాల విషయంలో భద్రతను గాలికి వదిలేసి ఇష్టానుసారం వ్యవహరించారన్నారు. డిజిటల్ మూల్యాంకనాన్ని పక్కనపెట్టి మాన్యువల్ ఎవాల్యుయేషన్ చేయాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ కోర్టును తప్పు దోవ పట్టించేలా అఫిడవిట్లు దాఖలు చేశారని చంద్రబాబు అన్నారు. కోర్టు ఆదేశాల తర్వాత సరిదిద్దుకోవాల్సింది పోయి హాయ్‌లాండ్‌లో మూల్యాంకనం కోసం రూ.1.19 కోట్ల విలువైన పనులకు ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. ఒకవైపు కోర్టు ఆదేశాలు ఉండగానే ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగ నియామకాలు కూడా చేపట్టారని తెలిపారు. హైకోర్టు ఈ వ్యవహారంపై విచారణ జరిపి విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు.

**ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, ప్లంబర్లతో పేపర్లు దిద్దించారు:**

గ్రూప్--1 వంటి అత్యున్నత స్థాయి ఉద్యోగాలకు అభ్యర్థులు రాసిన పరీక్షా పత్రాలను అర్హత లేని ప్రైవేటు వ్యక్తులతో దిద్దించారని సీఎం మండిపడ్డారు. ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, ప్లంబర్లు, సెక్యూరిటీ గార్డులు, గృహిణులు, నిరుద్యోగులు, సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లు, ల్యాబ్ టెక్నీషియన్లతో జవాబు పత్రాల మూల్యాంకనం చేయించారని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, హెచ్ఓడీలు వంటి నిపుణులు చేయాల్సిన మూల్యాంకనాన్ని టీచర్లు, లెక్చరర్లు, ఇతర అనర్హులతో చేయించడం తీవ్ర ఉల్లంఘన అని అన్నారు. మొత్తం 158 మంది ప్యానల్‌ను ఎంపిక చేసి అందులో 72 మందికి మూల్యాంకన బాధ్యతలు అప్పగించారని, వారిలో 25 మంది అనధికారికంగా నియమించిన వారేనని చంద్రబాబు తెలిపారు. మరో 66 మంది ఎవాల్యుయేటర్లు అనధికారికంగా పరీక్ష పత్రాలు దిద్దారని ఆరోపించారు. ప్రైవేటు వ్యక్తుల ల్యాప్‌టాప్‌లకు పరీక్షా మూల్యాంకన వివరాలను పంపించారని, పీడీఎఫ్ జవాబు పత్రాలను ప్రైవేటు ఈ-మెయిళ్లు, గూగుల్ డ్రైవ్, వాట్సప్ ద్వారా పంపించారని చెప్పారు. ఏపీపీఎస్సీ స్ట్రాంగ్ రూమ్ నుంచి జవాబు పత్రాలను అనధికారికంగా తరలించి 84 రోజుల పాటు హాయ్‌లాండ్‌లో ఉంచారని సీఎం తెలిపారు. మొదట హైదరాబాద్‌లో, ఆ తర్వాత హాయ్‌లాండ్‌లో మూల్యాంకనం నిర్వహించారని చెప్పారు. హాయ్‌లాండ్‌లో మూల్యాంకనం జరగలేదని హైకోర్టుకు అఫిడవిట్ ఇచ్చిన సమయంలోనే లాజిస్టిక్స్ కోసం రూ.1.14 కోట్లు ఖర్చు చేశారని పేర్కొన్నారు.

**డూప్లికేట్ ఓఎంఆర్ స్లిప్పులు:**

కొత్త చైర్మన్‌గా గౌతమ్ సవాంగ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత మాన్యువల్ ఎవాల్యుయేషన్‌కు ఆదేశాలు ఇచ్చారని చంద్రబాబు తెలిపారు. 49 వేల డూప్లికేట్ ఓఎంఆర్ స్లిప్‌లు ముద్రించినట్లు చెప్పారు. జవాబు పత్రాల్లో వేర్వేరు రాతలు, మార్పులు, చేర్పులు, ఓవర్‌రైటింగ్‌లు గుర్తించారని తెలిపారు.

# 37 డిగ్రీ కాలేజీలకు కొత్త భవనాలు

ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందించామని శాసనసభలో ప్రకటించారు. బుధవారం శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేశ్ సమాధానమిచ్చారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మంత్రి స్పందిస్తూ, ప్రస్తుతం ఆ కళాశాలలో విద్యార్థుల సంఖ్య 103కి చేరిందని, కళాశాలకు అవసరమైన భూమి అందుబాటులో ఉందని చెప్పారు. ప్రత్యేక పథకం కింద ఆళ్లగడ్డ కాలేజీకి కొత్త భవనం, ధ్వంసమైన ప్రహరీ గోడ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. అవసరమైన టీచింగ్, నాన్-టీచింగ్ సిబ్బందిని నియమించడంతో పాటు ల్యాబ్స్, కంప్యూటర్లు, బెంచీలను ఎమ్మెల్యే కోటా నిధుల (పీ4) కింద సమకూర్చుకోవాలని సూచించారు. ఒక్కో డిగ్రీ కళాశాల పూర్తిస్థాయిలో నిర్మించడానికి సుమారు రూ.15 కోట్లు ఖర్చవుతుందని, దశలవారీగా అన్ని కాలేజీలకు మౌలిక వసతులు కల్పిస్తామని స్పష్టం చేశారు.

**గ్రంథాలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి:**

రాష్ట్రంలో గ్రంథాలయాల వ్యవస్థను బలోపేతం చేయడంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని లోకేశ్ తెలిపారు. కడపలో గ్రంథాలయ నిర్మాణ పనులపై ఎమ్మెల్యే మాధవీ రెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, రాబోయే తొమ్మిది నెలల్లో పనులు పూర్తి చేసే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం గ్రంథాలయాలకు చెందాల్సిన సెస్సు నిధులను ట్రెజరీకి మళ్లించిందని, తాము అధికారంలోకి వచ్చాక ఆ నిధులను తిరిగి గ్రంథాలయ శాఖకు అందేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. మంగళగిరిలో కోటి రూపాయలతో ఏర్పాటు చేసిన మోడల్ లైబ్రరీ విజయవంతమైందని, రాత్రి 8 గంటల తర్వాత కూడా 300 మంది విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారని తెలిపారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో మోడల్ లైబ్రరీలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, పూర్వ విద్యార్థులు సీఎస్ఆర్ నిధుల ద్వారా సహకరిస్తే గ్రంథాలయాలను మరింత అభివృద్ధి చేయవచ్చని పిలుపునిచ్చారు.

## బాంబు పేల్చిన సుష్మితా పటేల్

వరంగల్,ఆగస్ట్19 మంత్రి కొండా సురేఖ కూతురు సుష్మితా పటేల్ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ కాక రేపుతున్నాయి. కాంగ్రెస్ టికెట్ ఇవ్వకపోతే పరకాల నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని మంత్రి కొండా సురేఖ కుమార్తె సుష్మితా పటేల్ సంచలన ప్రకటన చేశారు. పరకాల నియోజకవర్గంలో మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకల సందర్భంగా సుష్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి.

పరకాల నియోజకవర్గ రాజకీయాలపై సుష్మితా పటేల్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి అయిన తర్వాత రేవంత్ రెడ్డి వ్యవహారశైలిలో మార్పు వచ్చిందని అన్నారు. 'పొంగులేటి ముఖ్యమంత్రా.. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రా? అసలు ఎవరు సీఎం అనేది అర్థం కావడం లేదు' అని సుష్మితా వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేందుకు తన తండ్రి కొండా మురళీ కూడా సహకరించారని సుష్మితా పటేల్ పేర్కొన్నారు.

# చిన్నన్న జన్మదినం...

## కూకట్‌పల్లిలో చిరునవ్వులు పంచిన ఆత్మీయ కథ

ఐ ఎన్ బి టైమ్స్ కూకట్‌పల్లి ప్రతినిధి, ఆగస్టు 19
కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఘనంగా జరిగిన సతీష్ ఆరోరా జన్మదిన వేడుకలు కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదు... ప్రేమ, సేవ, పార్టీకి అంకితభావంతో నిండిన హృదయ స్పందనగా మారాయి. బిఆర్ఎస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా జన్మదిన శుభసందర్భంగా బాలాజీ నగర్ డివిజన్‌లో అంగరంగ వైభవంగా వేడుకలు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ పగడాల శిరీష బాబురావు, డివిజన్ సెక్రెటరీ వెంకటేష్ చౌదరి, మరియు సీనియర్ నాయకుడు పవన్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో స్థానిక శివానంద రిహాబిలిటేషన్ సెంటర్, రాందేవ్ హాస్పిటల్‌లో ఉన్న పేషెంట్లకు పండ్లు, బ్రెడ్స్ పంచిపెట్టారు. ఆకలితో ఉన్న వారికి ఓ చిన్న అందం, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఓ పెద్ద ఆశ---అదే ఈ వేడుకల అసలైన సారం. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సతీష్ అరోరా ఎన్నో సంవత్సరాలుగా పార్టీ కోసం, కార్యకర్తల కోసం అహర్నిశలు కష్టపడుతున్న తీరును గుర్తుచేశారు. హ్యాట్రిక్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అడుగుజాడల్లో నడుస్తూ, తనదైన వ్యూహాలతో పార్టీని విజయపథంలో నడిపిస్తూ, కార్యకర్తల మనసుల్లో ఎప్పటికీ నిలిచిపోయే "చిన్నన్న"గా ప్రజలకు చేరువవుతున్న విధానం ఎంతో ఆనందాన్ని కలిగించిందని వారు అన్నారు.

అంతటి సేవాభావంతో జరుపుకున్న ఈ జన్మదినం చూసిన వారందరిలోనూ ఒకే భావం వ్యక్తమైంది--- పుట్టిన రోజు కేవలం కేక్‌కోసం కాదు... మనిషి బతుకును మంచి పనులతో అర్థవంతం చేసుకోవడానికే.

ఈ కార్యక్రమంలో రాందేవ్ హాస్పటల్ సీఈఓ యోబు, కల్పనా, నాయినేని చిన్న తులసి రావు, సీనియర్



నాయకులు కంచనపల్లి నాగరాజు, వట్టి ఉపేందర్ రెడ్డి, పులి మురళి తదితర సీనియర్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఈ జన్మదినం సందర్భంగా రెడ్డి సతీష్ అరోరాకి శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు, ఆయన సేవా తపన మరింత మందిలో మంచి ఆశలు నింపాలని అందరూ కోరుకున్నారు.

## వరంగల్ లో నలుగురు సీ ఐ ల బదిలీ




ఐ ఎన్ బి టైమ్స్ హనుమకొండ ఆగష్టు 19:వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నలుగురు ఇన్స్పెక్టర్లను బదిలీ చేస్తూ సిపి యన్ శ్వేత ఉత్తర్వులు జారీ చేశారు. విఆర్ వరంగల్ లో పనిచేస్తున్న కే ఫణిధర్ ను నెక్కొండ సీఐగా నియమించారు. నెక్కొండ సిఐ శ్రీనివాసును వీఆర్ వరంగల్ కు బదిలీ చేశారు. వీఆర్ వరంగల్ లోని జె. శంకర్ రావును నర్సంపేట రూరల్ /దుగ్గొండి సిఐగా, అక్కడి యం. సాయి రమణ ను వీఆర్ వరంగల్ కు బదిలీ చేశారు.

## ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు...




ఐ ఎన్ బి టైమ్స్ ఆగస్టు 19 శేరిలింగంపల్లి ప్రతినిధి:మియాపూర్ ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ రంగానికి విశేష సేవలందించిన లూయిస్ డాగ్యూర్ కి నివాళులు అర్పించి, కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ, "ఒక ఫోటో ఎన్నో సజీవ సాక్ష్యాలను నిక్షిప్తం చేస్తుంది.

కాలం మారినా, ఫోటో ద్వారా ఆనాటి జ్ఞాపకాలను సజీవంగా నిలుపుకోవచ్చు" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు వాల్మీకి, ఉపాధ్యక్షులు రాజు, జనరల్ సెక్రటరీ విజయ్, జాయింట్ సెక్రటరీ గణేష్ యాదవ్, కోశాధికారి అన్వర్ ఖాన్, మీడియా పార్ట్‌నర్ దావత్ మహేష్, అలాగే అసోసియేషన్ సభ్యులు హర్ష నాయుడు, మొగిలి, శేఖర్, రవి, విష్ణు, శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఫోటోగ్రఫీ కళను ప్రోత్సహిస్తూ, ఫోటోగ్రాఫర్ల ఐక్యతను చాటుతూ ఈ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి.

## మదీనగూడ నారాయణ కళాశాలలో సైబర్ అవగాహన సదస్సు!..



ఐ ఎన్ బి టైమ్స్ ఆగస్టు19 శేరిలింగంపల్లి ప్రతినిధి: మదీనగూడ నారాయణ కళాశాలలో సైబర్ అవగాహన సదస్సు నిర్వహించారు. సమాజంలో రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల విద్యార్థులు, యువత అప్రమత్తంగా ఉండాలని మియాపూర్ పోలీసులు సూచించారు.

సురక్షా తిరంగా" కార్యక్రమంలో భాగంగా మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మదీనగూడ నారాయణ జూనియర్ కళాశాలలో సైబర్ క్రైమ్ అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సదస్సుకు సుమారు 200 మంది విద్యార్థులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా డి.ఐ. విజయ్ సైబర్ వారియర్ సూర్యతేజ విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల విస్తృత అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, ఫిషింగ్, ఫేక్ లింక్స్, ఓటీపీ మోసాలతో పాటు ప్రమాదకరమైన లోన్ యాప్‌లు, బెట్టింగ్ యాప్‌ల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. అలాగే సోషల్ మీడియాను సురక్షితంగా ఉపయోగించే పద్ధతులను నేర్పించారు.

డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించే సమయంలో అపరిచితుల సందేశాలు, లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు. ఒకవేళ ఎవరైనా సైబర్ ఆర్థిక మోసానికి గురైతే వెంటనే ఉచిత హెల్ప్‌లైన్ నంబర్ 1930 కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఇతర పోలీస్ అత్యవసర పరిస్థితుల్లో 112 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ పెట్రోల్ కార్ సిబ్బంది, కళాశాల యాజమాన్యం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## రాయవరంలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణపై హియరింగ్



ఐ ఎన్ బి టైమ్స్ -- మాచర్ల ప్రతినిధి । ఆగస్టు 19మాచర్ల నియోజకవర్గ పరిధిలోని రాయవరం గ్రామంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ూ×=) ప్రక్రియలో భాగంగా హియరింగ్ నిర్వహించారు. ఓటర్ల జాబితాలో పేర్లు, చిరునామాలు, ఇతర వివరాలకు సంబంధించి వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను అధికారులు పరిశీలించారు. హియరింగ్ సందర్భంగా సంబంధిత ఓటర్ల నుంచి సమర్పించిన వివరాలు, ఆధారాలను పరిశీలించి అర్హత ఉన్న ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు చేపట్టారు. డూప్లికేట్, మరణించిన లేదా ఇతర కారణాలతో అనర్హమైన నమోదులను గుర్తించి ఓటర్ల జాబితాను మరింత ఖచ్చితంగా రూపొందించే ప్రక్రియ కొనసాగుతోందిఈ హియరింగ్ కార్యక్రమంలో ఎంపీడీవో, పంచాయతీ సెక్రెటరీ, సచివాలయ సిబ్బంది, బూత్ లెవల్ ఆఫీసర్ (దీూ) పాల్గొని ఓటర్ల వివరాలను పరిశీలించారు. ఓటర్లు తమ పేరు, వివరాలు ఓటర్ల జాబితాలో సక్రమంగా ఉన్నాయా లేదా పరిశీలించుకోవాలని, ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## అయ్యప్ప సొసైటీలో సైబర్ అవగాహన కార్యక్రమం..

### 800 మంది పిల్లలు, యువతకు సైబర్ భద్రతపై అవగాహన...



ఐ ఎన్ బి టైమ్స్ ఆగస్టు 19 శేరిలింగంపల్లి ప్రతినిధి:
తెలంగాణ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సురక్ష కా తిరంగా -- టువర్డ్స్ ఏ సైబర్ ఇండిపెండెంట్ తెలంగాణ" నెలరోజుల సైబర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా అయ్యప్ప సొసైటీలో సైబర్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 800 మంది పిల్లలు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, ఐపీఎస్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై పాల్గొన్న వారికి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను వినియోగించే సమయంలో అప్రమత్తత, జాగ్రత్తలు పాటించడం ఎంతో ముఖ్యమని ఆమె సూచించారు. ఓటీపీ మోసాలు, ఫిషింగ్ లింకులు, నకిలీ పెట్టుబడి పథకాలు, ఫేక్ ఉద్యోగ ఆఫర్లు, వ్యక్తుల పేరుతో జరిగే మోసాలు, ఇతర ఆన్‌లైన్ స్కామ్‌ల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డీసీపీ హెచ్చరించారు. గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని సూచించారు. అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయడం, ధృవీకరించని సందేశాలకు స్పందించడం చేయకూడదని తెలిపారు. యువత సైబర్ సేఫ్టీ అంబాసిడర్లుగా మారి తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, చుట్టుపక్కల ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని డీసీపీ పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో సుమారు 800 మంది పిల్లలు, యువత చురుకుగా పాల్గొని సైబర్ భద్రతకు సంబంధించిన అంశాలపై అవగాహన పొందారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ మాదాపూర్ శ్రీధర్, మాదాపూర్ ఎస్‌హెచ్‌ఓ కె.వి. సుబ్బారావు, ఎస్‌ఐలు నరేష్, గిరీష్ తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల్లో నిరంతరం సైబర్ అవగాహన పెంపొందించడం, కమ్యూనిటీ భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం ద్వారా సైబర్ అవగాహన కలిగిన, సైబర్ సురక్షిత సమాజాన్ని నిర్మించేందుకు సైబరాబాద్ పోలీస్ కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు.

## ఆటోల్లో ఎల్‌ఈడీ లైట్లు, అధిక శబ్దంపై హెచ్చరిక

### - ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం-ట్రాఫిక్ ఎస్ఐ నరేష్



ఐ ఎన్ బి టైమ్స్ నందిగామ ఆగస్టు 19 :నందిగామ పట్టణ రామన్నపేట రోడ్డులో నందిగామ ట్రాఫిక్ పోలీసులు ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగా హన కార్యక్రమం నిర్వహిం చారు. పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, ఐపీఎస్ ఆదేశాలు, నంది గామ పట్టణ సీఐ పి. శ్రీను ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫామ్ ధరించి, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ప్రయాణికుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపరాదని, ఎల్‌ఈడీ లైట్లు, అధిక శబ్దంతో టేప్ రికార్డర్ వినియోగించరాదని హెచ్చరించారు. అలాగే ఆటో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని అధిక లోడుతో ప్రయాణిస్తే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. ప్రయాణికులు, వాహనదారుల భద్రతకు ప్రతి ఆటో డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.

## ఉచిత పథకాలపై ప్రజాధనం వృథా..

### కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లపై హైకోర్టు సంచలన వ్యాఖ్యలు...




ఐ ఎన్ బి టైమ్స్ ఆగష్టు 19 శేరిలింగంపల్లి:
తెలంగాణలో ఎంతో ప్రాముఖ్యం కలిగిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలు, విచారణకు సంబంధించి రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేసింది.

రాష్ట్రంలో చట్టబద్ధత లేని పథకాల కోసం ప్రజాధనాన్ని విచ్చలవిడిగా వృథా చేయడంపై హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ప్రజాధనాన్ని కేవలం ఉచిత పథకాలకే కాకుండా, నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను లాభాల బాట పట్టించేందుకు ఉపయోగించి, దానిద్వారా వచ్చే ఆదాయంతో సంక్షేమ పథకాలను అమలు చేస్తే బాగుంటుంది కదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.

**భూసేకరణ బాధితుల సమస్యలపై ధర్మాసనం ప్రశ్నలు:**
రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల నిమిత్తం భూములు కోల్పోయిన భూ బాధితుల సమస్యల పట్ల కూడా న్యాయస్థానం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. భూసేకరణ ప్రక్రియలో సరైన పరిహారం, న్యాయం అందక అనేకమంది బాధితులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని గుర్తుచేసింది. ఒకవైపు నిరుపేద భూ బాధితులకు న్యాయం చేయడంలో జాప్యం జరుగుతుండగా, మరోవైపు సంక్షేమ పథకాలకు భారీగా నిధులు వెచ్చించడంపై స్పష్టత ఇవ్వాలని ఆదేశించింది. భూ బాధితుల విషయంలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వివరాలను సమర్పించాలని సూచించింది.

**స్టే ఎత్తివేతకు కోర్టును కోరిన ప్రభుత్వం:**
ఇదే సమయంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై ఉన్న స్టేను ఎత్తివేసి, నిలిచిపోయిన లబ్ధిదారులకు సహాయం అందించేలా వెసులుబాటు కల్పించాలని ప్రభుత్వం తరఫు న్యాయవాదులు హైకోర్టును కోరారు. పేద వర్గాల వివాహాలకు
ఆర్థిక సాయం అందించే ఈ పథకాలు ఎంతో మందికి ఉపయోగపడుతున్నాయని వివరించారు. ఈ క్రమంలో భూ బాధితులకు సంబంధించిన పరిహారం, ఇతర అంశాలపై ప్రభుత్వం తన స్పష్టమైన వైఖరిని రేపటి కల్లా తెలియజేయాలని ఆదేశిస్తూ ధర్మాసనం విచారణను వాయిదా వేసింది.

# ఇరాన్ క్షిపణి దాడులపై అరబ్ ఆగ్రహం

## ఇరాన్‌తో వాణిజ్య బంధాన్ని తెంచుకుంటున్నట్లు ప్రకటన



న్యూఢిల్లీ,ఆగస్ట్19 ఇరాన్‌తో అన్ని వాణిజ్య, ఆర్థిక లావాదేవీలను నిలిపివేసినట్లు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రకటించింది. ఇరాన్ క్షిపణి దాడుల నేపథ్యంలో యూఏఈ ఈ చర్య తీసుకుంది. ప్రాంతీయ ఉద్రిక్తతల దృష్ట్యా... ఇరాన్‌తో అన్ని వాణిజ్య, వ్యాపార వ్యవహారాలు, ఆర్థిక లావాదేవీలను తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు నిలిపివేశామని యూఏఈ విదేశాంగ మంత్రిత్వ శాఖ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ అఫ్రా అల్ హమెలీ తెలిపారు. మరో క్షిపణి ముప్పు గురించి దేశ ప్రజల్ని హెచ్చరిస్తూ ఫోన్ అలర్ట్ జారీ చేసిన దాదాపు రెండు గంటల తర్వాత యూఏఈ ఈ ప్రకటన చేసింది. 'ప్రస్తుత పరిస్థితి, క్షిపణి ముప్పు కారణంగా, వెంటనే ప్రజలు సురక్షిత భవనాల్లోకి వెళ్లాలని యూఏఈ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ సదరు ఫోన్ అలర్ట్‌లో పేర్కొంది. అయితే, ఆ అలర్ట్‌ను కొద్దిసేపటికే ఉపసంహరించారు. ఫిబ్రవరి 28న పశ్చిమాసియా యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి, ఇరాన్ దాడుల తీవ్రతను యూఏఈ ఎక్కువగా ఎదుర్కొంది. ఈ ప్రాంతంలోని మరే ఇతర దేశం కంటే ఎక్కువగా, దాదాపు 3,000 క్షిపణులు, డ్రోన్‌లు ఆ దేశంపై ఇరాన్ ప్రయోగించింది. గల్ఫ్‌లోని నౌకా రవాణాపై ఇరాన్ రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిందని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆరోపించగా, ఈ ఆరోపణను ఇరాన్ ఖండించింది. ఇరాన్ తమ దేశం వైపు క్షిపణిని ప్రయోగించిందన్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వాదనను ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయీ ఖండించారు. ఈ వాదన ప్రాంతీయ విశ్వాసానికి, భద్రతా ప్రయత్నాలకు హానికరమని ఆయన పేర్కొన్నారు.

# డ్రగ్స్ రాకెట్ ముఠా గుట్టురట్టు

## ముగ్గురు డ్రగ్స్ సరఫరాదారుల అరెస్ట్




హైదరాబాద్,ఆగస్ట్19 హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలి పీఎస్ పరిధిలో ఎస్‌వోటీ, స్థానిక పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టి డ్రగ్స్ రాకెట్‌ను గుట్టురట్టు చేసినట్లు శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. ముగ్గురు ప్రధాన డ్రగ్స్ సరఫరాదారులను అరెస్టు చేసి వారి వద్ద కొనుగోలు చేస్తున్న 16 మందిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. నిందితుల నుంచి రూ.16.40 లక్షల విలువైన 95.41 గ్రాముల ఎండీఎంఏ, 50 గ్రాముల ఓజీ కుష్ గంజాయితో పాటు 2 మొబైల్ ఫోన్లను స్వాధీనం
చేసుకున్నామన్నారు. ఆగస్టు 11న వట్టినాగులపల్లి కింగ్‌డమ్ పబ్ రోడ్డు వద్ద డ్రగ్స్ విక్రయిస్తున్న యశ్వంత్ సాయి షణ్ముఖ్ అనే పెడ్లర్‌ను అదుపులోకి తీసుకున్నాం. విచారించగా డ్రగ్స్ మూలాలు బెంగళూరు, కేరళలో ఉన్నట్లు వెల్లడైంది. వెంటనే మా ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఈనెల 18న కేరళలోని త్రిస్సూర్‌లో మహమ్మద్ రజల్ అబ్దుల్ గఫూర్‌ను అరెస్ట్ చేశాం. విచారణలో ఓ నైజీరియన్ నుంచి డ్రగ్స్ తెచ్చినట్లు అతడు తెలిపాడు. బెంగళూరులో నవీన అనే మహిళా పెడ్లర్‌ను పోలీసులు అరెస్ట్ చేశాం. ఆమె ఇంట్లో సోదాలు నిర్వహించి భారీగా మాదక ద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నాం. నిందితురాలిని విచారించగా.
. కేరళలో ఉండే తన స్నేహితుడు అనేశ్వర్ ద్వారా డ్రగ్స్ సేకరించి ఇక్కడ విక్రయిస్తున్నట్లు అంగీకరించింది. పట్టుబడిన నిందితులందరిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశాం. ఈ నెట్‌వర్క్‌పై దర్యాప్తు మరింత ముమ్మరంగా కొనసాగుతోంది. మాదకద్రవ్యాల సరఫరాపై ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే డయల్ 100, సైబరాబాద్ పోలీసుల వాట్సప్ నెంబర్ 8712663061కు ఫిర్యాదు చేయాలని డీసీపీ సూచించారు.

# మద్యం సేవించి వాహనం నడిపితే ఇక తప్పదు జరిమానా!

## దుర్గిలో ఇద్దరికి రూ.10 వేల చొప్పున ఫైన్



ఐ ఎన్ బి టైమ్స్ దుర్గి, ఆగస్టు 19:రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా దుర్గి పోలీసులు నిర్వహిస్తున్న డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఇద్దరికి న్యాయస్థానం జరిమానా విధించింది.మాచర్ల పట్టణానికి చెందిన మొగిలి రాయప్ప బాబు, నకరికల్లు మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన మల్లెల వెంకటేష్ మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. ఈ ఘటనపై దుర్గి పోలీస్ స్టేషన్ ఎస్ఐ బి. గోపాల్ కేసులు నమోదు చేసి, నిందితులను మాచర్ల ××వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఒ ×× తరగతి న్యాయ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు.విచారణ అనంతరం గౌరవ న్యాయస్థానం ఇద్దరు నిందితుల్లో ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున జరిమానా విధించింది.ఈ సందర్భంగా ఎస్ఐ బి. గోపాల్ మాట్లాడుతూ..

మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, రోడ్డు ప్రమాదాలకు ఇది ప్రధాన కారణాల్లో ఒకటని తెలిపారు. వాహనదారులు తమ కుటుంబ సభ్యులతో పాటు ఇతర రహదారి వినియోగదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు.దుర్గి మండల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ బి. గోపాల్ హెచ్చరించారు.

# నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ వ్యవహారం

## సంస్కరణలపై సుప్రీంలో విచారణ



న్యూఢిల్లీ,ఆగస్ట్19(నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ వ్యవహారం, జాతీయ పరీక్షల సంస్థలో సంస్కరణలకు సంబంధించిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. పరీక్షల నిర్వహణలో శాశ్వత, సమగ్ర సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరాన్ని కోర్టు స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణకు పటిష్ఠ వ్యవస్థ అవసరమని అభిప్రాయపడింది. ఎన్‌టీఏలో చేపట్టిన సంస్థాగత సంస్కరణలు, ప్రశ్నపత్రాల భద్రత, పరీక్షల పారదర్శకత, సైబర్ భద్రత తదితర అంశాలపై పూర్తి వివరాలను అఫిడవిట్‌లో పొందుపరచాలని సుప్రీంకోర్టు కోరింది. కేవలం తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ ఆరాధే ధర్మాసనం ఈ వ్యవహారాన్ని విచారిస్తోంది. ఎన్‌టీఏలో సంస్కరణలను తాము పర్యవేక్షిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణలో పదేపదే తలెత్తుతున్న సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలు కాకుండా వ్యవస్థాగత మార్పులు అవసరమని పేర్కొంది. ఎన్టీఏను సంస్థాగతంగా బలోపేతం చేయాలని, నీట్ పరీక్షల భద్రతకు శాశ్వత కమిటీ అవసరమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. విద్యార్థుల భవిష్యత్తు, విశ్వసనీయత కోసం ఎన్టీఏలో నిర్మాణాత్మక మార్పులు చేయాలని సూచించింది. నీట్-2026 ప్రశ్నపత్రం లీక్ నేపథ్యంలో పరీక్ష రద్దు చేయాల్సి రావడం, విద్యార్థులు ఎదుర్కొన్న ఇబ్బందుల తర్వాత ఎన్టీఏ పనితీరుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎన్టీఏలో శాశ్వత సంస్కరణలు అమలు చేయడంపై సుప్రీంకోర్టు దృష్టి సారించింది.

# బిసిల పట్ల కట్టప్పలా మారిన జగన్

## బిసి రిజర్వేషన్లపై ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి



అమరావతి,ఆగస్ట్19 రాష్ట్రంలో బీసీల పాలిట జగన్మోహన్ రెడ్డి కట్టప్పలా వ్యవహరించి వెన్నుపోటు పొడిచి అన్యాయం చేశారని ఆదోని నియోజకవర్గం భాజపా ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. బుధవారం అసెంబ్లీ సమావేశంలో ఆయన బీసీ రిజర్వేషన్లపై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీ మేరకు బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు నిర్ణయించడం హర్షించదగ్గ విషయమన్నారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా 16,800 మంది బీసీలకు అవకాశం దక్కుతుందన్నారు. బీసీ వర్గీకరణ చేపట్టి రాజకీయ పదవులు అందరికీ అందేలా చూడాలన్నారు. గత వైకాపా ప్రభుత్వం బీసీలను రాజకీయంగా వాడుకునేందుకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని జీవోలు జారీచేసి.. చివరికి 24 శాతానికి కుదించి తీవ్రంగా అన్యాయం చేశారన్నారు. నీతి ఆయోగ్ సూచనలు మేరకు ప్రత్యక్ష విధానంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించడం శుభ పరిమాణం అన్నారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు హయాం నుంచి బీసీల పట్ల తెలుగుదేశం పార్టీ ఆలోచిస్తుందన్నారు. ఇందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆదోని పట్టణంలో రహదారులను విస్తరించి ట్రాఫిక్ సమస్యలను తగ్గించాలని ఆదోని భాజపా ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి బుధవారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని కోరారు. 1987 తర్వాత ఇప్పుడు 2025లో వంద అడుగుల వెడల్పుతో మాస్టర్ ఎ÷-లాన్ వచ్చిందన్నారు. దీనిని అమలు చేసి పట్టణాన్ని అభివృద్ధి చేయాలని పురపాలక శాఖ మంత్రి నారాయణను కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రత్యక్ష విధానంలో నిర్వహించడం వల్ల పారదర్శకతతో పాటు అక్రమాలకు తావుండదన్నారు. గత వైకాపా పాలనలో ఆదోని పురపాలక సంఘంలో ఇద్దరు ఛైర్‌పర్సన్‌లను మార్చిన ఘనత ఆ పార్టీకే దక్కిందన్నారు. ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని తీసుకొస్తున్నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

# సంస్థాగత బలోపేతం, సమిష్టి నాయకత్వం

నిజామాబాద్, ఆగస్టు 19 జిల్లా కేంద్రంలోని దుబ్బలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కాంగ్రెస్ పీఏసీ సమావేశం జరిగింది. సమావేశానికి మంత్రి సీతక్క, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం, గ్రామస్థాయి నుంచి పార్టీ విస్తరణ, ప్రజా సమస్యలపై పోరాట కార్యాచరణ తదితర అంశాలపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ బలోపేతానికి ప్రత్యేక కృషి చేస్తున్న డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ జిల్లాలో పార్టీని మరింత పటిష్టం చేసేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్మోహన్ రావు, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కర్, నిజామాబాద్ కార్పొరేషన్ అర్బన్ డిసిసి అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, కామారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, పీఏసీ సభ్యులు, డిసీసీ నాయకులు, మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతం, సమిష్టి నాయకత్వం, ప్రజలతో మమేకమే లక్ష్యంగా ఈ సమావేశం విజయవంతంగా ముగిసింది.

# కశ్మీర్‌లోకి 10వేల మంది ఉగ్రవాదుల తరలింపు

## - నసీర్ మాద్నీ సంచలన వ్యాఖ్యలు



లాహోర్,ఆగస్ట్19 పాక్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఓ మతబోధకుడు చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. పంజాబ్ ప్రావిన్స్‌లోని బహావల్‌నగర్‌లో ఆగస్టు 14న జరిగిన సమావేశంలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన నసీర్ మాద్నీ కశ్మీర్ గురించి పలు సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఉగ్రసంస్థ ఎల్ఈటీ చీఫ్ హఫీజ్ సయీద్ కశ్మీర్‌లోకి 10 వేల మంది ఉగ్రవాదులను పంపించినట్టు చెప్పాడు. దీంతో, కశ్మీర్‌లో ఉగ్ర నెట్‌వర్క్ వ్యాప్తిపై ఆందోళన వ్యక్తం అవుతోంది. హఫీజ్ సయీద్ సారథ్యంలోని లష్కరే తొయిబా భారత్‌లో అనేక దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి హఫీజ్‌పై పలు కేసులు నమోదయ్యాయి.

26/11 దాడుల్లో మంది పాక్ ఉగ్రవాదులు సముద్రమార్గంలో ముంబైలోకి ప్రవేశించి నాలుగు రోజుల పాటు మారణ హోమం సృష్టించారు. ఈ ఉగ్రవాద దాడిలో 166 మంది మరణించగా 300 మంది గాయపడ్డారు. ఇక గతేడాది పహల్గాం దాడిలో 26 మంది సాధారణ పౌరులు కన్నుమూసిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి జమ్మూలోని కోర్టు హఫీజ్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఐక్యరాజ్య సమితి, అమెరికా కూడా ఎల్ఈటీని ఉగ్రవాద సంస్థగా ప్రకటించాయి.

# మండలిలో డిఎస్సీపై వైసిపి వాయిదా తీర్మానం

అమరావతి,ఆగస్ట్19 ఏపీ అసెంబ్లీ, శాసన మండలి సమావేశాలు మూడో రోజు ప్రారంభమయ్యాయి. బుధవారం శాసనమండలిలో మెగా డీఎస్సీపై వైసీపీ సభ్యులు వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ వాయిదా తీర్మానాన్ని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు తిరస్కరించారు. ఈ నేపథ్యంలో చైర్మన్ పోడియం వద్ద వైసీపీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. వారి ఆందోళనతో శాసనమండలిలో గందరగోళం నెలకొంది. డీఎస్సీపై చర్చ పెట్టాలని వైసీపీ సభ్యులు డిమాండ్ చేశారు. పోడియాన్ని చుట్టుముట్టి ఆ పార్టీ సభ్యులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

# తప్పిన పెను ప్రమాదం

ఏలూరు, ఆగస్టు 19 : ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ సమీపంలో బుధవారం ఉదయం పెనుప్రమాదం తప్పింది. విజయవాడ నుంచి అమలాపురం వెళ్తున్న ఏపీఎస్‌ఆర్టీసీ బస్సు మార్గమధ్యంలో సాంకేతిక కారణాలతో నిలిచిపోగా, అప్రమత్తమైన డ్రైవర్ ప్రయాణికులను మరో ఆర్టీసీ బస్సులో తరలించాడు. వాహనం రిపేర్ కోసం బస్సును రోడ్డు మార్జిన్ వైపు నిలపగా, అదే సమయంలో బస్సును వేగంగా వచ్చిన కంటైనర్ ఢీకొట్టింది.